సాక్షి
కాకినాడ

ఆదివారం । 3 । మార్చి । 2024



రూ.లక్ష విరాళం


ఆలమూరు: చింతలూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు కొత్తపేట ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, లావణ్య దంపతులు శనివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



రూ.1.50 లక్షల విరాళం

నల్లజర్ల: చీపురుగూడెంలోని వినాయకస్వామి ఆలయ నిర్మాణానికి చెల్లు శ్రీరామ్మూర్తి, సూర్య కాంతమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.1.50 లక్షల విరాళం అందజేశారు.

డెల్టాలకు 8,970 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 9.75 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

స్కానింగ్ సెంటర్లపై నిఘా



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

కాకినాడ సిటీ: అల్ట్రాసౌండ్ స్కానింగ్ ప్రక్రియ గర్భస్థ పిండ లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లతో నిఘా మరింత విస్తృతం చేయాలని జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య ఆదేశించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం అమలుపై కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. కొత్తగా ఒక అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్ ఏర్పాటుకు, రెండు సెంటర్ల రిజిస్ట్రేషన్ రెన్యువల్‌కు కమిటీ ఆమోదం తెలిపింది. అలాగే సెంటర్ల చిరునామా, యంత్రాలు, సిబ్బంది మార్పులు, సెంటర్ల మూసివేతకు అనుమతి కోరుతూ అందిన 9 దరఖాస్తులకు కూడా అంగీకారం తెలిపింది. ఆడ శిశువుల పట్ల వివక్ష సమాజంలో ఇంకా అక్కడక్కడ కొనసాగుతోందని, దీనిని పూర్తిగా అరికట్టేందుకు పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని జేసీ ప్రవీణ్ ఆదిత్య ఆదేశించారు. గడచిన రెండు నెలల్లో డివిజనల్ స్థాయి అధికారులు స్కానింగ్ సెంటర్లపై 8 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించారని, వీటిని మరింత ఎక్కువగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి జె.నరసింహ నాయక్, దిశ డీఎస్పీ ఆర్.రామచంద్రరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అనిత, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎస్.స్వప్న, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె.రత్నకుమార్ పాల్గొన్నారు.

రత్నగిరికి భక్తుల తాకిడి



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో రత్నగిరి శనివారం కిటకిటలాడింది. శుక్రవారం రాత్రి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అధికంగా వివాహాలు జరిగాయి. ఆ నవదంపతులు పెద్ద సంఖ్యలో సత్యదేవుని దర్శనానికి తరలి వచ్చారు. వీరితో పాటు సాధారణ భక్తులు కూడా భారీగా తరలి రావడంతో రత్నగిరిపై రద్దీ నెలకొంది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. వ్రతాలు 1,800 జరిగాయి. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటలు, రూ.300 టికెట్‌తో ప్రదక్షిణ దర్శనానికి గంట సమయం పట్టింది. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. నిత్యాన్నదాన పథకంలో 4 వేల మందికి భోజనం పెట్టారు.

ఇంటర్ పరీక్షలకు 353 మంది గైర్హాజరు

కాకినాడ సిటీ: ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. సంస్కృతం పేపర్-2, తెలుగు-2, హిందీ-2, ఒకేషనల్ జీఎఫ్‌సీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 17,015 మంది హాజరు కావాల్సి ఉండగా 16,662 మంది పరీక్ష రాశారు. 353 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకు 1,253 మందికి గాను 1,202 మంది హాజరయ్యారు. 51 మంది గైర్హాజరయ్యారు. డీఐఈఓ, ఎస్‌వో, డీఈసీ-1, డీఈజీ-2, డీఈసీ-3లు, ముగ్గురు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్‌లు మొత్తం 24 కాలేజీలను తనిఖీ చేశారు.

తక్కువ ధరలో కషాయాలు

పిఠాపురం: ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్న రైతులకు తక్కువ ధరల్లో ఆ సాగుకు అవసరమైన కషాయాలు అందిస్తున్నామని జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి ఎలియాజర్ తెలిపారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలోని గాయత్రి బయో రిసోర్సు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ కేంద్రం ద్వారా వివిధ ద్రావణాలు, కషాయాలు తయారు చేసి పలు రాష్ట్రాల్లోని రైతులకు అందిస్తున్నామని తెలిపారు.

స్వర్ణకాంతులు

- సత్యదేవుని సన్నిధిలో నూతన ధ్వజస్తంభం
- 28 నుంచి ప్రతిష్ఠాపన మహోత్సవాలు
- రూ.3.5 కోట్లతో బంగారు తొడుగు ఏర్పాటు
- ముందుకు వచ్చిన దాత
- ఆలయ శిఖరాన్నీ స్వర్ణమయం చేయాలని ఇప్పటికే నిర్ణయం



సత్యదేవుని ఆలయం

అన్నవరం: రత్నగిరి స్వర్ణకాంతుల్ని అద్దుకుంటోంది. ఇప్పటికే సత్యదేవుని ఆలయ శిఖరానికి బంగారు రేకు తాపడం చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ధ్వజస్తంభాన్ని కూడా సువర్ణమయం చేయాలని అధికారులు నిర్ణయించారు. నూతన ధ్వజస్తంభం ఏర్పాటుకు, దీనికి బంగారు రేకు తాపడం చేసేందుకు ఒక దాత ముందుకు వచ్చారు.

3 కేజీల బంగారంతో..

సత్యదేవుని ఆలయానికి అభిముఖంగా ప్రస్తుతం ఉన్న ధ్వజస్తంభాన్ని సుమారు 50 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఆ తరువాత దానికి వెండి రేకు తాపడం చేశారు. అయితే ఈ ధ్వజస్తంభం కర్ర పుచ్చిపోయి శిథిలావస్థకు చేరిందని, దేవస్థానం పండితులతో కూడిన వైదిక కమిటీ గత ఏడాది ఆగస్టులో అప్పటి ఈఓ చంద్రశేఖర్ ఆజాద్‌కు నివేదిక ఇచ్చింది. దీంతో నూతన ధ్వజస్తంభం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దీనిని రూ.3.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసేందుకు నెల్లూరుకు చెందిన ఒక దాత గత ఏడాది ఆగస్టులోనే ముందుకు వచ్చారు. ధ్వజస్తంభానికి అవసరమైన నారప వృక్ష జాతికి చెందిన 64 అడుగుల కర్రను గుంటూరు జిల్లా తెనాలిలోని ధ్వజస్తంభాలు తయారు చేసే టింబర్ డిపోలో గుర్తించారు. దీనిని గత ఏడాది అక్టోబర్‌లో అప్పటి ఈఓ ఆజాద్, దేవస్థానం వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు, విశ్రాంత స్థపతి ప్రసాద్ తదితరులు ఎంపిక చేశారు. ఈ కర్రను స్తంభంగా రూపొందించి, దేవస్థానంలోని పంపా సత్రానికి ట్రాలీపై ఇప్పటికే తీసుకుని వచ్చారు. దీనికి బంగారు తొడుగు కూడా అమర్చనున్నారు.

ఏప్రిల్ 18 వరకూ..

ప్రస్తుతం ఉన్న ధ్వజస్తంభం కళాప్రకర్షణ (తొలగింపు), నూతన ధ్వజస్తభం ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలు ఈ నెల 28న ప్రారంభం కానున్నాయి. వీటిని ఏప్రిల్ 18 వరకూ నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన వైదిక కార్యక్రమాల షెడ్యూల్‌ను ఈ నెల 7న జరిగే ధర్మకర్తల మండలి సమావేశంలో నిర్ణయించనున్నారు. నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని దేవస్థానం వేద పండితులు, సిబ్బందిని ఈఓ కె.రామచంద్ర మోహన్ శనివారం ఆదేశించారు. ఆయన, వేద పండితుడు గొల్లపల్లి ఘనపాఠి, డీఈలు రాంబాబు, ఉదయ్‌లు పాత ధ్వజస్తంభాన్ని పరిశీలించారు.

ఆలయ శిఖరం స్వర్ణమయానికి టీటీడీ సహకారం

ఇదిలా ఉండగా, సత్యదేవుని ఆలయ శిఖరానికి స్వర్ణ రేకు తాపడం చేసేందుకు తిరుమల - తిరుపతి దేవస్థానం సహకారం అందించనుందని ఈఓ రామచంద్ర మోహన్ తెలిపారు. ఇప్పటికే దేవదాయ శాఖ ప్రధాన స్థపతి పరమేశ్వరప్ప గత నెలలో ఇక్కడకు వచ్చి, ఆలయ శిఖరాన్ని పరిశీలించారు. ఆలయ శిఖరాన్ని స్వర్ణమయం చేసేందుకు సుమారు 11.5 కిలోల బంగారం అవసరమవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. దీనికి రూ.7.5 కోట్లు వ్యయమవుతుందని లెక్క తేల్చారు. దీంతో ఆలయ శిఖరం స్వర్ణరేకు తాపడానికి విరాళాలు సేకరించేందుకు అనుమతించాల్సిందిగా దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి నివేదిక పంపించారు. ఈ విషయంలో పూర్తి అవగాహన ఉన్నవారితో పూర్తి స్థాయిలో కొలతలు తీసి, ఎంత బంగారం అవసరమవుతుందో నివేదిక పంపాల్సిందిగా కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయని ఈఓ తెలిపారు. ఈమేరకు టీటీడీ సాంకేతిక విభాగం సిబ్బందితో అంచనా వేయించనున్నామని ఈఓ చెప్పారు. టీటీడీ ఆధ్వర్యాన పలు దేవాలయాలకు స్వర్ణ రేకు తాపడం పనులు జరిగినందున, దీనిపై వారికి పూర్తి అవగాహన ఉంటుందని తెలిపారు. సాధ్యమైనంత త్వరలో ఈ పనులు పూర్తి చేసి, స్వర్ణ రేకు తాపడానికి విరాళాలు సేకరిస్తామని తెలిపారు.



పంపా సత్రం వద్ద ఉంచిన నూతన ధ్వజస్తంభం కర్ర





ధ్వజస్తంభం ప్రతిష్ఠపై వేద పండితులు, ఇంజినీరింగ్ అధికారులతో చర్చిస్తున్న ఈఓ రామచంద్ర మోహన్

వైభవంగా..



నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తాం. ఈ మేరకు దేవస్థానం వేద పండితులు, ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలిచ్చాం. ఈ నెల 7న జరిగే ధర్మకర్తల మండలి సమావేశంలో పాత ధ్వజస్తంభం కళాప్రకర్షణ, నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమాల షెడ్యూల్ ఖరారు చేస్తాం. 64 అడుగుల నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించడం కొంత క్లిష్టమైన ప్రక్రియ అయినందున అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటాం.

– కె.రామచంద్ర మోహన్, ఈఓ, అన్నవరం దేవస్థానం

నేడు పల్స్‌పోలియో



కాకినాడ క్రైం: జిల్లావ్యాప్తంగా ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని 1,94,332 మంది ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కల మందు అందించాల్సి ఉండగా, 2,43,120 డోసుల మందు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమం నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 5,280 మంది సిబ్బందితో 2,640 బృందాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1,320 బూత్‌లు, 120 మొబైల్ బృందాలను సిద్ధం చేశారు. జిల్లావ్యాప్తంగా 360 హైరిస్క్ ప్రాంతాల్లో 17,765 మంది పిల్లలున్నారని గుర్తించారు. కాకినాడ సమీపాన సముద్రంలో ఉన్న హోప్ ఐలాండ్‌లో పల్స్‌పోలియో నిర్వహణకు జిల్లా ఇమ్యునైజేషన్ డాక్టర్ రత్నకుమార్ ఆధ్వర్యాన ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. అక్కడ 25 నుంచి 30 మంది పిల్లలు ఉంటారని అంచనా వేశారు. గాడిమొగ వైద్యాధికారి, సూపర్‌వైజర్ ద్వారా అక్కడకు ప్రత్యేక బోటులో వెళ్లి, వ్యాక్సిన్ వేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశామని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ నరసింహ నాయక్ తెలిపారు. వంద శాతం చిన్నారులకు చుక్కల మందు అందించేందుకు శ్రమిస్తున్నామని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కన్నీడి రత్నకుమార్ చెప్పారు. బూత్‌ల వద్దకు రాలేకపోయిన వారికి సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి వ్యాక్సిన్ వేస్తామని తెలిపారు. పిల్లలకు చుక్కల మందు వేయించే వేళ వారి పూర్తి ఆరోగ్య పరిస్థితిని తల్లిదండ్రులు వెల్లడించాలని కోరారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి


- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- కాకరాపల్లిలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

కోటనందూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమమే ప్రామాణికంగా వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా కోరారు. మండలంలోని కాకరాపల్లిలో వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ ఆధ్వర్యాన నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి రాజా.. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రూ.8 కోట్ల విలువైన ఆసరా నమూనా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ లగుడు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి ప్రసంగించారు. గడచిన 4 సంవత్సరాల 10 నెలల్లో సీఎం జగన్ పారదర్శక పాలన అందించారన్నారు. కన్నవాళ్లు, తోబుట్టువులు కూడా చేయని విధంగా వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నేరుగా నగదు జమ చేశారని చెప్పారు. గత టీడీపీ పాలనంతా అవినీతి మయమని గుర్తు చేశారు. గతంలో కొత్త పింఛన్లు పొందాలంటే మూడు నెలల పింఛను సొమ్మును టీడీపీ నాయకులకు లంచంగా ఇవ్వాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం సీఎం జగన్‌తో పాటు వైఎస్సార్ సీపీ నాయకులకు కూడా అవినీతి మరకలు లేవని చెప్పారు. తుని నియోజకవర్గంలో 2019-23 మధ్య 20 వేల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క ఇల్లు కూడా ఇచ్చిన దాఖలాల్లేవన్నారు. నియోజకవర్గంలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న ఎన్నో సమస్యలకు తమ ప్రభుత్వంలో పరిష్కారం చూపామని చెప్పారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు ఇంగ్లిషులో మాట్లాడుతుంటే టీడీపీ, ఎల్లో మీడియా ఓర్వలేకపోతున్నాయన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి తమ కుటుంబాలకు మంచి చేశామని భావిస్తే వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, తనను గెలిపించాలని మంత్రి దాడిశెట్టి రాజా కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, తుని ఏఎంసీ చైర్మన్ మాకినీడు బాబు, వైస్ చైర్మన్ వెలగా వెంకట కృష్ణాజీ, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, మాజీ చైర్మన్లు లాలం బాబ్జీ, బొంగు ఉమారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, తహసీల్దార్ విజయ్‌కుమార్‌రాజు, ఎంపీడీఓ జయ మాధవి తదితరులు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

సత్యదేవునికి ఆభరణాల సమర్పణ



బంగారు నేత్రాలు, కనురెప్పలు, మీసాలు

అన్నవరం: సత్యదేవునికి రూ.1.75 లక్షల విలువ చేసే 16 గ్రాములు బరువు కలిగిన బంగారు నేత్రాలు, కనురెప్పలు, మీసాలను, 1.057 కేజీల బరువు కలిగిన వెండి బకెట్‌ను దేవస్థానం వ్రత పురోహితులు సమర్పించారు. ఈ వస్తువులను ఈఓ కె.రామచంద్ర మోహన్‌కు శనివారం అందజేశారు. వ్రత పురోహిత సంఘం తరఫున తొయ్యేటి హరనాథ్ సుబ్రహ్మణ్యం, కొల్లూరి లక్ష్మీనారాయణ, డ్యూటీ సభ్యులు వీటిని తయారు చేయించారు.

ర్యాంప్ సర్వే వేగవంతం చేయాలి

కాకినాడ సిటీ: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ పెర్ఫార్మెన్స్ (ర్యాంప్) సర్వేను వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శనివారం కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లా జిల్లా అధికారులనుద్దేశించి మాట్లాడుతూ, ర్యాంప్ సర్వే ఈ నెల 1న ప్రారంభమైందన్నారు. దీని ద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లోని వివిధ సంస్థలను డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకువచ్చి, ఏపీ ఎంఎస్ఎంఈ వన్ పోర్టల్‌కు అనుసంధానం చేస్తారని వివరించారు. సర్వేను ఈ నెల 20వ తేదీకి పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, జిల్లాలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఆదివారం జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున సాగు, తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా, ర్యాంప్ సర్వేకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా పరిశ్రమల అధికారులతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా ఆవిష్కరించారు.



ర్యాంప్ సర్వే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

క్లుప్తంగా

విఘ్నేశ్వరునికి బంగారు పళ్లెం, వెండి బిందె సమర్పణ



బంగారు పళ్లెం, వెండి బిందె అందజేస్తున్న సత్యనారాయణ దంపతులు

అయినవిల్లి: మండల కేంద్రం అయినవిల్లిలో కొలువైన విఘ్నేశ్వరస్వామికి ఇదే మండలం వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన సుతాపల్లి సత్యనారాయణ, బాలసత్య దుర్గాకుమారి దంపతులు శనివారం రూ.5,10,000 విలువైన 81.600 గ్రాముల బంగారు పళ్లెం, రూ.80 వేలు విలువ చేసే 1,003 గ్రాముల వెండి బిందె సమర్పించారు. స్వామివారి అన్న ప్రసాద ట్రస్ట్‌కు రూ.20 వేల విరాళం అందజేశారు. ఈ వస్తువులను, సొమ్మును ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబుకు అందించారు.

విద్యార్థుల్లో నైపుణ్యానికి స్రైడ్స్ దోహదం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జేఎన్‌టీయూకే ఫ్యాకల్టీ కరుణ

గండేపల్లి: విద్యార్థుల నైపుణ్యతను తెలుసుకునేందుకు స్రైడ్స్ దోహద పడుతుందని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు అన్నారు. సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో స్రైడ్స్ 2024 పేరిట రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఇటువంటి సదస్సులు ఉపయోగపడతాయన్నారు. మరో ముఖ్య అతిథి, జేఎన్‌టీయూకే ఫ్యాకల్టీ ఎ.కరుణ మాట్లాడుతూ స్మార్ట్ ప్రగతి హాకథాన్‌లో భాగంగా విద్యార్థుల ప్రదర్శనలు సమాజానికి ఉపయోగపడేలా ఉన్నాయన్నారు. ఉత్తమమైన ప్రదర్శనలను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎంవీ హరనాథ బాబు, మేనేజ్‌మెంట్ ఎం.సతీష్, వైస్ ప్రెసిడెంట్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

మత్స్యకారుడి మృతి

ఉప్పలగుప్తం: అల్లవరం మండలం నక్కా రామేశ్వరానికి చెందిన ఆరుగురు మత్స్యకారులు శనివారం ఉదయం ఫైబర్ ఇంజిన్‌లో బోటులో సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. చల్లపల్లి పంచాయతీ పరిధి వాసాలతిప్ప తీరంలో వేటాడుతుండగా సముద్రపు అలలకు బోటు తిరగబడింది. దీంతో కొపనాతి కోదండం (40) నీటిలో మునిగి మృతి చెందగా, మిగిలిన ఐదుగురూ ఒడ్డుకు చేరుకున్నారు.

బూడిద పూసిన బంగారం

- బూడిద గుమ్మడికి మంచి డిమాండ్
- పెట్టుబడి తక్కువ, లాభాలు ఎక్కువ
- జిల్లాలో పెరిగిన సాగు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న బూడిద గుమ్మడి కాయలు

పిఠాపురం: మన సంస్కృతిలో బూడిద గుమ్మడిది ప్రత్యేక స్థానం. శుభకార్యాలు, పూజలు, వంటలు, ఔషధాల తయారీలో దీన్ని విరివిగా ఉపయోగిస్తున్నారు. గతంలో దిష్టి తీయడానికి, వడియాలలో ఉపయోగించే బూడిద గుమ్మడికి కరోనా అనంతరం ప్రాధాన్యం పెరిగి బూడిద పూసిన బంగారంలా మారిపోయింది. ఒకప్పుడు చెత్త కుప్పలు, ముళ్ల కంచెలు, ఎక్కడ పడితే అక్కడ పండే ఈ పంటను ఇప్పుడు రైతులు తమ పొలాల్లో పండించి మంచి రాబడి సాధిస్తున్నారు. ఇతర పంటలతో పోలిస్తే గుమ్మడి సాగులో శ్రమ, ఖర్చు తక్కువ. పిఠాపురం నియోజకవర్గంతో పాటు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వందల ఎకరాల్లో అంతర పంటగా గుమ్మడి సాగు జరుగుతోంది.

బూడిద గుమ్మడి.. భలే రాబడి

ఎకరానికి రూ.15 వేల పెట్టుబడితో బూడిద గుమ్మడిని సాగు చేస్తే దాదాపు 15 టన్నుల వరకూ దిగుబడి వస్తుంది. ఒక్కో కాయ సుమారు 2 కేజీల నుంచి 10 కేజీల వరకూ బరువు తూగుతుంది. మార్కెట్‌లో టన్ను రూ.18 వేలు ధర పలుకుతోంది. కేవలం మూడు నెలల వ్యవధిలో పంట చేతికి వస్తుంది. ఇతర పంటలకు ఒక ఎకరానికి సరిపడే నీరు, బూడిద గుమ్మడికి నాలుగెకరాలకు సరి పోతుంది. చీడ పీడల బెడద ఉండక పోవడంతో ఎరువులు, పురుగు మందులు అవసరం లేదు. విత్తనం, ఎరువులు, కూలీల ఖర్చులతో సహా ఎకరానికి రూ.15 వేలు మాత్రమే పెట్టుబడి అవుతుంది. ఎకరానికి 15 టన్నుల వరకు దిగుబడి వచ్చి, రూ 1.50 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. కాకినాడ జిల్లాలో పండిస్తున్న బూడిద గుమ్మడి కాయలను తమిళనాడు, కేరళ, బెంగాల్, ఒడిశా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేయడం ద్వారా రైతులు మంచి ఆదాయం ఆర్జిస్తున్నారు.

దిష్టికే కాదు ఆరోగ్య పరిపుష్టికి కూడా..

ఏ ఇంటి ముందు చూసినా దిష్టి తగలకుండా బూడిద గుమ్మడి కాయను తగిలిస్తారు. ఇది ఆరోగ్య పరిపుష్టికి కూడా ఎంతో ఉపయోగపడుతుంది. వంద గ్రాముల బూడిద గుమ్మడి జ్యూస్‌లో కేవలం 10 కేలరీలు మాత్రమే ఉండడంతో దీన్ని జీఓ కేలరీల జ్యూస్‌గా చెబుతారు. కూరగాయలన్నింటిలో అతి తక్కువ కేలరీలు ఉన్నది ఇది ఒక్కటే. కానీ దీనిలో విటమిన్స్, మినరల్స్, లవణాలు చెప్పలేనన్ని ఉంటాయి. ప్రతి రోజూ ఒక గ్లాసు జ్యూస్ తీసుకుంటే శరీరంలో కేన్సర్ కణాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని, గుండె పనితీరు మెరుగు పడుతుందని పరిశోధనల్లో తేలింది. కోళ్ల ఫారాల్లో కోళ్లకు యాంటిబయోటిక్ మందుగా దీనిని ఉపయోగిస్తున్నారు.

ఆదాయం బాగుంది



ఎకరం పొలంలో పెద్ద పెండలం తోట వేసి, అంతర పంటగా బూడిద గుమ్మడిని సాగు చేస్తున్నాను. టన్ను కాయలు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ పలుకుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి పంటను కొనుగోలు చేస్తున్నారు. పెట్టుబడి తక్కువైనప్పటికీ ఆదాయం పదిరెట్లు ఎక్కువ ఉంటోంది. నాటు రకాలకే ఎక్కువ డిమాండ్ ఉంటోంది.

– కొండపల్లి వీరబాబు, విరవాడ, పిఠాపురం మండలం

రైతుల్లో పెరిగిన ఆసక్తి



పిఠాపురం నియోజకవర్గంలో ఈ పంటను సాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. పెట్టుబడి తక్కువ, అంతర పంటగా సాగు చేసుకునే వీలు, ఆదాయం ఎక్కువగా ఉండడంతో రైతుల్లో ఆసక్తి పెరిగింది. గత రెండేళ్ల కంటే ఈ ఏడాది ఈ పంటను సాగు చేసే రైతులు పెరిగారు. ఉద్యానశాఖ ద్వారా వారికి సూచనలు, సలహా అందిస్తున్నాం. మార్కెటింగ్ సౌకర్యం పెరగడంతో ఆదాయం బాగుంటోంది.

– కేఎస్ శైలజ, ఉద్యానశాఖాధికారి, పిఠాపురం

పెళ్లికి వెళ్లి వచ్చేసరికీ ఇంటిలో చోరీ

రాజోలు: పెళ్లికి వెళ్లి వచ్చేసరికీ ఇంట్లో దొంగలు పడి రూ.20 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులను చోరీ చేశారు. శివకోడు గ్రామానికి చెందిన గాదె వెంకట సూర్యరామ మురళీకృష్ణ గత నెల 28న ఇంటికి తాళం వేసి పెళ్లికి వెళ్లారు. తిరిగి ఈనెల ఒకటో తేదీ రాత్రి ఇంటికి వచ్చారు. ఇంటికి రాగానే తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి, లోపలకు వెళ్లి చూడగా ఇంట్లో బీరువాలో దాచిన సుమారు రూ.20 లక్షల విలువైన వెండి, బంగారు వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించారు. ఈ మేరకు శనివారం రాజోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే తరహాలో రాజోలులోని ఎల్‌బీ నగర్‌లో నివాసం ఉంటున్న డిగ్రీ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బొంతు మధుకుమార్ ఇంటిని తలుపులు దొంగలు గునపాలతో బద్దలు కొట్టి బీరువాలోని సుమారు రూ.5 లక్షల విలువ చేసే బంగారు వస్తువులను మూడు రోజుల క్రితం దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రాజోలు ఎస్సై పృథ్వీ సంఘటనా స్థలాలను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు ఆధారాలను సేకరించాయి.

గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి



వాడపల్లి వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఉదయం స్వామివారిని పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. రాష్ట్రం నలుమూల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో కొలువైన క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామికి పూజలు చేశారు. ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులతో ఆలయ ప్రాంగణంలో కిక్కిరిసింది. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ మాట్లాడుతూ స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్న ప్రసాద విరాళం, సేవలు, లడ్డూ విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ ద్వారా రూ.40,32,051 ఆదాయం సమకూరిందన్నారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించారు.

అప్పనపల్లికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు తీరిన స్వామిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు, ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. స్వామి వారి సన్నిధిలో ప్రతి నిత్యం నిర్వహించే శ్రీలక్ష్మీనారాయణ హోమంలో భక్తులు పాల్గొన్నారు. స్వామి వారి ఉచిత అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2.51 లక్షలు ఆదాయం వచ్చింది. టిక్కెట్లు, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.1.93 లక్షలు సమకూరింది. నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.57,159 విరాళాలు సమర్పించారు. 3,964 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. 3,012 మంది భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీనివాస్, కొమ్ముల సూరిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కట్టుకున్నవాడే కడతేర్చాడు



సంఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు



లక్ష్మి (ఫైల్)

నల్లజర్ల: ప్రేమించి, పెళ్లి చేసుకున్న భార్యను ఓ వ్యక్తి హత్య చేశాడు. ఆపై ఆమె ఆత్మహత్య చేసుకున్నట్టు నమ్మించబోయి పోలీసులకు దొరికిపోయాడు. సీఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. జగన్నాథపురానికి చెందిన గుర్రం వెంకటేశు, కోటమ్మల కుమార్తె లక్ష్మికి అదే గ్రామానికి చెందిన తానెం విష్ణుతో 11 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరూ ప్రేమించుకుని, పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. విష్ణు పామాయిల్ గెలల కోత కార్మికుడిగా, లక్ష్మి (28) జీడిగింజల ఫ్యాక్టరీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే భార్యతో విష్ణు తరచూ గొడవ పడేవాడు. ఇష్టానుసారం కొట్టేవాడు. శుక్రవారం రాత్రి కూడా భార్యభర్తలు గొడవ పడ్డారు. తెల్లవారిన తర్వాత ఇరుగుపొరుగు వారికి విష్ణు తన భార్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని చెప్పాడు. అనుమానం వచ్చిన వారు లక్ష్మి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారువచ్చి చూడగా లక్ష్మి ఒంటిపై గాయాలు కనిపించాయి. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. విష్ణును అదుపులోకి తీసుకొని విచారించగా లక్ష్మిని తలపై కొట్టడంతో చనిపోయిందని, తానే కిటికీకి చున్నీ కట్టి ఉరి వేసినట్టు చిత్రీకరించానని ఒప్పుకున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.